క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



హస్నాబాద్‌లో మెలికపడిన విద్యుత్ తీగలు

దుద్యాల్: విద్యుత్ తీగలు ఒక దానికి ఒకటి అల్లుకుని ప్రమాదం సంభవించే అవకాశం మండలంలోని హస్నాబాద్ గ్రామంలో సోమవారం కనిపించింది. గ్రామంలోని తెలుగు వాడలో భీమరాయ గుడికి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న మెయిన్ లైన్ తీగలు ఒకదానికి ఒకటి అల్లుకున్నాయి. విద్యుత్ అధికారులు వీటిని గుర్తించడం లేదు. ఇలాగే ఉంటే ప్రమాదం సంభవించవచ్చని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలి

ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్



ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్యలు వివరిస్తున్న లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: ప్రైవేటు విద్యా సంస్థల్లో బీసీ విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సచివాలయంలో విద్యా శాఖ, బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌యాదవ్ పలు సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీకి విన్నవించారు. పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే, గురుకుల వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని ఆయన కోరారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్ రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామసభల్లో పరిష్కారించుకోవచ్చని తహసీల్దార్ బి.విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని రుద్రారం గ్రామ రైతువేదికలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, పారిశుద్ధ్య పనులు, బీటీ రోడ్డు తదితర వాటి కోసం ఎక్కడ ఏ మేరకు అవసరమవుతాయో తెలియజేయాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం గ్రామశివారులోని నర్సరీని పరిశీలించారు.

మరమ్మతులు ప్రారంభం



తూము వద్ద చేపట్టిన మరమ్మతు పనులు

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లి ప్రాజెక్టు తూము మరమ్మతు పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. తూముల లీకేజీతో ప్రాజెక్టులోని నీరంతా వృథాగా పారుతోంది. ఇటీవల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జుంటుపల్లి ప్రాజెక్టును సందర్శించి పరిశీలించారు. ప్రధానంగా ప్రాజెక్టు తూములు, కాల్వలు మరమ్మతుకు గురయ్యాయని స్థానిక ఆయకట్టు రైతులు ఎంపీ దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులను తూము మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి తూముల పని పూర్తి చేయాలనే ఉద్దేశంతో పనులను చేపట్టారు.

షాదీఖానా నిర్మించండి

కొడంగల్ రూరల్: పట్టణంలోని తాండూర్ రోడ్డులో శిథిలావస్థకు చేరిన షాదీఖానా స్థానంలో నూతన షాదీఖానాను నిర్మించాలని ఎంఐఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు గుల్షన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. గత 12ఏళ్లుగా షాదీఖానా శిథిలావస్థకు చేరినా.. ఎన్నో పర్యాయాలు వినతులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవలేదన్నారు. షాదీఖానా లేకపోవడంతో ముస్లింలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కొత్త భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.సర్తజ్‌హుస్సేన్, షేక్‌రోమన్, ఎండీ.పాషా, ఎండీ.ఆబిద్ పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- మండల కేంద్రానికి నేటికీ మంజూరు కాని అంబులెన్స్
- రోగులు, గర్భిణులకు తీవ్ర ఇబ్బందులు
- ఎమర్జెన్సీ అయితే ప్రైవేటు వాహనాలే దిక్కు
- రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న జనాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

దోమ : ఏళ్లు గడుస్తున్నా మండల కేంద్రంలో అంబులెన్స్ వాహనం (108) సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యావసర పరిస్థితుల్లో వృద్ధులు, వికలాంగులు, బాలింతలు, గర్భిణులు ఆస్పత్రికి తరలించాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కువుతున్నాయి. ప్రభుత్వం అత్యవసర సేవల కోసం ప్రతి మండలంలోని ఆరోగ్య కేంద్రానికి 108 వాహనాలను కేటాయించింది. కాని, దోమ మండలానికి మాత్రం ఇప్పటికీ కేటాయించలేదు.

50 వేల జనాభా ఉన్నా..

మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు, 50 వేల వరకు జనాభా ఉన్నారు. ఇంత జనాభా ఉన్న మండలంలో ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో పాటు 8 సబ్ సెంటర్లు ఉన్నాయి. కానీ అంబులెన్స్ సౌకర్యం మాత్రం అందుబాటులో లేదు. మండలంలోని దాదాపూర్, కొత్తపల్లి, గుండాల, బట్లచందారం, బుద్లాపూర్, బ్రహ్మణపల్లి, దిర్సంపల్లి, కిష్టాపూర్ ఐనాపూర్, గోట్లచెల్కతండా, పెద్దతండా, మోత్కుర్, గొన్యానాయక్‌తండా, తిమ్మాయిపల్లి, పాలేపల్లి, బొంపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అనారోగ్య పరిస్థితుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. వారికి అందుబాటులో అంబులెన్స్ సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గర్భిణులకు పురిటి నొప్పులు వస్తే అంబులెన్స్ లేక నరకయాతన పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. కొంత మంది రోడ్డు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడితే వారిని వెంటనే ఆస్పత్రికి తరలించాలంటే గగనంగా మారుతోంది. పరిగి పట్టణం నుంచి అంబులెన్స్ వాహనం వచ్చే సరికి ఎక్కువ సమయం పట్టుతుండటంతో క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు ఎన్నో నెలకొన్నాయి. అంబులెన్స్ సమయానికి రాక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అనేక ఘటనలు..

మండల ప్రజలకు అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి. తిమ్మాయిపల్లి సమీపంలో ఆటోను బైక్ ఢీకొట్టడంతో 108 వాహనం సమయానికి రాక ఊటుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు ప్రైవేటు వాహనాలలో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురు వాహనదారులు, ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడిన సందర్భంలో గంటల తరబడి వేచి ఉండి సమయానికి ఆస్పత్రులకు చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల మండలానికి 108 వాహన సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా మండలానికి నూతన అంబులెన్స్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు



మొదటి నుంచి దోమ మండంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్ లేదు. ప్రజలు అంబులెన్స్ వాహనం లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణులకు పురిటి నొప్పులు మొదలైతే ఆస్పత్రికి తరలించాలంటే ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. ఈ విషయం అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసిన పట్టించుకోవడం లేదు.

–రాజిరెడ్డి, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు, దోమ

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..



మండలంలో అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేయించేలా శ్రద్ధ తీసుకుంటాం. నిత్యం ఆయా గ్రామాల నుంచి ప్రజలు ప్రమాదాల బారిన పడుతుండడంతో పాటు వృద్ధులు, గర్భిణులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గమనిస్తున్నాం. విషయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మండలానికి అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం.

– అనసూయ, ఎంపీపీ, దోమ

ప్రతిపాదనలు పంపిస్తాం



అంబులెన్స్ లేని విషయం వాస్తవమే. దీనిపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు మండల కేంద్రంలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

– రజిత, మండల వైద్యాధికారి, దోమ

హెచ్‌ఎంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



ఎస్‌ఐకి వినితిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఉద్దాండపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌కుమార్‌శర్మపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గౌతపూర్ సమీపంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. గ్రామానికి చెందిన శరత్ అనే విద్యార్థి బోనఫైడ్‌కు సంబంధించి హెచ్‌ఎం అసభ్యంగా మాట్లాడారని పేర్కొన్నారు. తన కొడుకును పాఠశాల్లో చేర్పించుకోవాలని విద్యార్థి తండ్రి బుడగజంగం రాములు పాఠశాలకు వెళ్లితే హెచ్‌ఎం రవీందర్‌కుమార్ శర్మ కులంపేరుతో దూషించారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు శ్రీను, నర్సింలు, బలరాం, సురేశ్, దీపక్, కళ్యాణ్ ,శ్రీనివాస్‌లు ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు: ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

ఉద్దాండపూర్ హెచ్‌ఎం రవీందర్‌కుమార్ శర్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి శరత్ తండ్రి రాములు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

ధర్నా విరమించిన రైతులు



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బొంరాస్‌పేట: ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని సోమవారం కొత్తూరు అసైన్డ్ భూముల రైతులు చేపట్టిన ధర్నాను విరమించారు. ప్రభుత్వం నుంచి ఇదివరకు పంపిణీ చేసిన భూములకు డిజిటల్ పాస్‌పుస్తకాలిచ్చి పట్టా కల్పించాలని కోరుతూ ఈనెల 20న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కొత్తూరు అసైన్డ్ భూముల రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు బాధిత రైతులు, దళిత ప్రజాసంఘాల నాయకులు చేపట్టిన ధర్నాను డిప్యూటీ తహసీల్దార్ స్పందించి హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, లక్ష్మయ్య, రత్నయ్య తదితరులు ఉన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

బీజేవైఎం నేతల ఆందోళన



ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న నాయకులు

అనంతగిరి: ప్రభుత్వం వెంటనే 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తున్న బీజేవైఎం నాయకులపై జరిగిన దాడిని నిరసిస్తూ వికారాబాద్ పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రూప్ –1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలన్నారు. గ్రూప్–2, 3 నోటిఫికేషన్లో అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగుల సమస్య పరిష్కరించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ ఎదుట ధర్నా నిర్వహిస్తే పోలీసులను పెట్టి ఈ ప్రభుత్వం విచక్షణ రహితంగా దాడులు చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనిల్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్, సాయికృష్ణ, వెంకట్, జగన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ సమావేశంలో అధికారులు

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం నిధుల వినియోగం, చేపట్టిన పనుల విషయమై సోమవారం సామాజిక తనిఖీ సమావేశం నర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులు బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు 47గ్రామపంచాయతీలు ఖర్చుల సామాజిక తనిఖీ నివేదికలు విచారించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటగౌడ్ ఆధ్వర్యంలో రూ.6.94కోట్లు నివేదికల సామాజిక తనిఖీ కొనసాగుతోంది. మంగళవారం ముగియనున్నట్లు చెప్పారు. ఇందులో ఫైనాన్స్ మేనేజర్ రవి, ఏపీడీ సరళ, విజిలెన్స్ అధికారి భార్గవి, ఏపీఓ మల్లికార్జున్ తదితరులున్నారు.

నూతన గదుల్లో తరగతులు కొనసాగించాలి



నూతన భవనం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

- బిల్లులు చెల్లించలేదని భవనానికి తాళం
- కళాశాల ఎదుట విద్యార్థి, ప్రజాసంఘాల ఆందోళన

తాండూరు టౌన్ : తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల భవనంలో తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవలే ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా భవన ప్రారంభోత్సవం చేశారు. అయితే, ఈ భవనంలో తరగతులు కొనసాగాల్సి ఉండగా కాంట్రాక్టర్ భవనానికి తాళం వేసుకుని వెళ్లాడు. ఇందుకు కారణం బిల్లులు పెండింగ్ ఉండటమేనని ఆరోపించారు. అధికారులు స్పందించి తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌మోహన్‌ను వివరణ కోరగా నూతన భవనానికి సంబంధించిన నీటి పైపులైను బిగించాలని, అలాగే కొన్ని పత్రాలు సమర్పించాలని ఆర్ అండ్ బీ డీఈ శ్రీనివాస్ చెప్పారన్నారు. రెండు మూడు రోజుల్లో భవనాన్ని అప్పగిస్తామని ఆయన చెప్పారని వివరించారు. తాళం చెవి కాంట్రాక్టర్ దగ్గరే ఉందన్నారు.

ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు



విద్యార్థులను చేర్చుకుంటున్న హెచ్‌ఎం

పెద్దేముల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాలల్లో చేర్పించాలని పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమ వారం 86 మంది కొత్త విద్యార్థులను వివిధ తరగతిల్లో చేర్చుకున్నామని అన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 430 మంది విద్యార్థులు ఉన్నారని, కొత్తగా చేరిన వారితో 500మంది క్రాసింగ్ కాబోతుందని హెచ్‌ఎం తెలియచేశారు. విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్‌లు, టెస్ట్‌బుక్‌లను అందజేశామన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

యాలాల: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తాండూరు ఏఎంసీ మాజీ డైరెక్టర్ వెంకటయ్య అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనతను అరికట్టవచ్చని వైద్యాధికారి నరేష్ చంద్ర అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలం చాకల్‌పల్లిలో రక్తహీనత నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా కామెర్లు, శరీరం పాలిపోయి ఉండటం, చేతులు వంపు తిరిగి ఉండటం వంటి లక్షణాలు రక్తహీనత వ్యాధిని సూచిస్తారు. దీనిని మందుల ద్వారా వ్యాధిని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబిబాయి, రాములమ్మ, పుష్పలత, పార్వతమ్మ పాల్గొన్నారు.

తైబజార్ వేలం



సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

దోమ : వారాంతపు సంతలో తైబజార్ వసూలు చేసుకునేందుకు సోమవారం వేలంపాట నిర్వహించారు. దిర్సంపల్లి పంచాయతీ కార్యదర్శి రాజేశ్ ఆధ్వర్యంలో తైబజార్ వేలం నిర్వహించారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ అనే వ్యక్తి రూ. 53 వేలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. వేలం దక్కించుకున్న సతీష్‌కు వచ్చే ఏడాది మార్చి వరకు గడువు ఉంటుందని కార్యదర్శి రాజేశ్ పేర్కొన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు తైబజారు వేలం

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో జరిగే వారాంతపు సంత తైబజారు వేలాన్ని మంగళవారం ఉ.11గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు కార్యదర్శి నర్సింలు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే సభ్యులు రూ.10వేల డిపాజిట్లు చేయాల్సి ఉంటుందని చెప్పారు. దుకాణదారుల నుంచి రూ.30లకు మించి తీసుకోవద్దని సూచించారు. వేలం పాటలో నెగ్గిన వారు డబ్బులు కట్టనిచో అతని కంటే తక్కువ వేలం పాడిన వారికి కేటాయిస్తామని వివరించారు.

సామగ్రి ఎత్తుకెళ్లిన వారిపై చర్యలు తప్పవు

ఎంపీపీ అరవింద్‌రావు



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు

పరిగి: పాఠశాల సామగ్రిని ఎత్తుకెళ్లిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ అరవింద్‌రావు హెచ్చరించారు. మండలంలోని రంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కింద చేపడుతున్న పనుల సామగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. టాయిలెట్స్ కుండీలు, పైపులను ధ్వంసం చేశారు. సోమవారం ఎంపీపీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంస చేయడం నేరమన్నారు. సామగ్రిని ఎత్తుకెళ్లి, ధ్వంసం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పూడూరు: మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు వేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతలపల్లిలో ప్రత్యేక నిధులు రూ.కోటి 40లక్షలతో బీటీరోడ్డు, గొంగుపల్లి తండాకు కోటి, మైసమ్మగడ్డ తండాకు కోటి పది లక్షలతో పనులు ప్రారంభించారు. పూడూరు మండలాన్ని ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటి పెంచాలనే ఆశయంతో బీటీ రోడ్డు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అజీంపటేల్ పాల్గొన్నారు.

టెండర్లకు ఆహ్వానం

కొడంగల్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులోని గిరిజన గురుకుల విద్యాలయంలో పలు అంశాలకు సంబంధించి టెండర్లు వేసుకోవచ్చని ప్రిన్సిపాల్ ఇ.బలరాం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25విద్యా సంవత్సరానికి గాను కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, కోడిగుడ్లు, క్యాటరింగ్ సర్వీస్, స్వీపింగ్, శానిటేషన్ తదితర అంశాలకు సంబంధించి టెండర్‌దారులు విద్యాలయం నుంచి దరఖాస్తు ఫారం తీసుకోవాలని తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్ రంగారెడ్డి పేరు మీద వెయ్యి రూపాయల డీడీ తీసి దరఖాస్తు పొందాలని సూచించారు. దరఖాస్తు ఫారం పొందేందుకు 25వ తేదీ మంగళవారం చివరి రోజని స్పష్టం చేశారు.

హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం



తాండూరు రూరల్: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



బంట్వారం: సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తాండూరు రూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ అన్నారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. త్వరలో ఇళ్లు, మహిళలకు రూ.2500 పథకం కూడా అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తమ్‌చందు, వడ్డెశ్రీను, సుదర్శన్‌రెడ్డి, పండరి, రఘునాథ్‌రెడ్డి, జర్నప్ప, ఉదయ్ భాస్కర్, రాముయాదవ్, శ్రీశైలంగౌడ్, వెంకటేశం, రాజుగౌడ్, బస్వరాజ్, విజయ్‌కుమార్, నర్సింలు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బంట్వారం: ఒకే దఫా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కోట్‌పల్లిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.

రుణమాఫీ చరిత్రాత్మకం

యాలాల: రుణమాఫీ నిర్ణయం చరిత్రాత్మకమవుతోందని యాలాల మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అధిష్టానం పిలుపు మేరకు సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో టపాకులు పేల్చి, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, భీమప్ప, మాజీ ఎంపీటీసీ రాజు, యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మన్నాన్, నాయకులు రాజేందర్‌రెడ్డి, ఖాసీం, అశోక్ నాయిా, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

రుణమాఫీ నిర్ణయం హర్షణీయం

కుల్కచర్ల: ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం త్వరలో రూ. 2లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు మాఫీ చేసేందుకు పది సంవత్సరాల సమయం తీసుకున్న లాభం లేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని పేర్కొన్నారు.

ఒకే విడతలో రూ.2లక్షలు మాఫీ

తాండూరుటౌన్ : స్థానిక అంబేడ్కర్‌చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఒకే విడతలో రూ.2లక్షలు మాఫీ చేయనున్నట్లు సీఎం ప్రకటించడం హర్షణీయమన్నారు. ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, హబీబ్‌లాలా, ఎంఏ అలీం, బస్వరాజ్, బాల్‌రెడ్డి, నీరజ, విజయాదేవి, ప్రవీణ్‌గౌడ్, రవి, నాగరాజు, బాలప్ప పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

పెద్దేముల్: రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల రుణమాఫీకి సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి మండలంలోని పలు గ్రామాల నాయకులు, యువకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు నజీర్, మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, నర్సింలు, ఎల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.